క్లుప్తంగా

సాక్షి ఫొటోగ్రాఫర్‌కు హరీశ్‌రావు సన్మానం



సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సతీశ్‌ను సన్మానిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సమాచారశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో రాష్ట్రస్థాయి అవార్డు సాధించిన సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సతీశ్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం సన్మానించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువతో సన్మానించి అభినందించారు. అంతకు ముందు జాతీయస్థాయి అత్యపత్య పోటీలకు ఎంపికైన విద్యార్థులు సాత్విక, చరణ్య, ప్రణవ్, శ్రీరాంను సన్మానించారు. అదేవిధంగా జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు మనీష, పూజిత, ప్రసన్న, సంధ్య, నర్మద, సురేశ్‌యాదవ్, కవితారావు, సంపత్, సంధ్యను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభ చూపిన వారికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాక్షి స్టాఫ్ రిపోర్టర్ రాజు, ఆర్సీ ఇన్‌చార్జి చంద్రమౌళి, జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగాచారి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కథల పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విశ్వతేజ

చిన్నకోదూరు(సిద్దిపేట): రెండు తెలుగు రాష్ట్రాల పాఠశాలల విద్యార్థులకు ఖమ్మంలో నిర్వహించిన బాలల కథల పోటీల్లో మండల పరిధిలోని అనంతసాగర్ ఉన్నత పాఠశాల విద్యార్థి విశ్వతేజ ప్రతిభ చూపాడు. విశ్వతేజ రాసిని 'బెట్టింగ్ గేమ్' కథ మొదటి బహుమతికి ఎంపికైంది. 24న ఖమ్మంలో నిర్వహించే కార్యక్రమంలో ఆ విద్యార్థికి నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు విశ్వతేజను అభినందించారు.

కొనసాగుతున్న ఉత్సవాలు



హోమం నిర్వహిస్తున్న పండితులు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని గణేశ్‌పల్లిలో బాట లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం కూడా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు తరలివచ్చి స్వామివారి సేవలో పాల్గొనాలని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

భక్తిభావంతోనే ప్రశాంతత



నవగ్రహాలకు పూజలు చేస్తున్న హరీశ్‌రావు

చిన్నకోదూరు(సిద్దిపేట): భక్తిభావంతో మనసు ఆహ్లాదకరంగా, ప్రశాంతంగా అనిపిస్తుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లిలో హనుమాన్ దేవాలయంలో ఆదివారం నిర్వహించిన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండే విధంగా చల్లని చూపు ఉండాలని ఆంజనేయస్వామిని వేడుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, నాయకులు కాముని శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, పాపయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

టెండర్‌దారుడికి నోటీసు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో కొబ్బరికాయలు విక్రయిస్తున్న టెండర్‌దారుడికి ఆలయ ఈఓ అన్నపూర్ణ ఆదివారం నోటీసు జారీచేశారు. ఆలయంలో కొబ్బరికాయల విక్రయానికి ఇటీవల టెండర్ నిర్వహించగా గ్రామానికి చెందిన డి.విష్ణుమూర్తి రూ.45,50,116లు అధిక పాటపాడి హక్కును దక్కించుకున్నారు. అయితే షరతుల ప్రకారం ఒక్కొక్క కొబ్బరికాయ రూ.30లకు విక్రయించాలి. కాని రూ.50లకు విక్రయిస్తుండడంతో బొమ్మల రామారానికి చెందిన భక్తుడు కార్తీక్ యాదవ్ ఫిర్యాదు చేశాడు. ఆలయ ప్రతిష్టకు భంగం కలిగిందని, షరతులు ఎందుకు పాటించడం లేదని ఈఓ నోటీసు జారీ చేశారు. మూడు రోజులలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని, లేకపోతే టెండర్ రద్దుచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నెలరోజుల్లో రెండింతలు

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

వానలతో దెబ్బతిన్న తోటలు

- ఘాటెక్కిన పచ్చిమిర్చి
- రూ.60కి పైనే.. టమాటా
- వినియోగదారుల బెంబేలు



దుబ్బాక మార్కెట్‌లో విక్రయిస్తున్న కూరగాయలు

దుబ్బాక: ఏం తినేటట్టు లేదు.. ఏం కొనేటట్టు లేదు.. అన్నట్టుంది కూరగాయల ధరల పరిస్థితి. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గింది. ఫలితంగా కూరగాయల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని అంటాయి. నెల రోజుల్లో ధరలు రెండింతలు పెరిగిపోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అలాగే రైతుల పరిస్థితికూడా దయనీయంగా మారింది.

కూరగాయలకు ప్రసిద్ధి

రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా కూరగాయలసాగుకు ప్రసిద్ధి గాంచింది. జిల్లాలో ఏడాది పొడవునా సుమారు 16,500 హెక్టార్ల విస్తీర్ణంలో కూరగాయలు పండిస్తున్నారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లోని చాలా గ్రామాల నుంచి కూరగాయలు ప్రతిరోజు ఇతర జిల్లాలకు ఎగుమతి అవుతుంటాయి.

6 వేల హెక్టార్లలో టమాటా

సుమారు 6వేల హెక్టార్లలో టమాటా పండుతుంది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, భువనగిరి జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఇక్కడి నుంచి ప్రతిరోజు ఎగుమతి అవుతుంటాయి. టమాటా పంట విస్తీర్ణం బాగా పెరగటం, ఉత్పత్తి ఎక్కువగా ఉండటంతో నెల రోజుల క్రితం వరకు కిలో టమాటా రూ.20 కంటే తక్కువగా ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతినడం, ఉత్పత్తి తగ్గడంతో రూ.60 రూపాయల వరకు ధర పలుకుతుంది. అలాగే సుమారు 1,600 హెక్టార్లలో పచ్చిమిర్చి పండుతుంది. రాష్ట్రంలోని ప్రధాన మార్కెట్లతోపాటు మహారాష్ట్రకు పచ్చిమిర్చి ఎక్కువగా జిల్లా నుంచే ఎగుమతి అవుతోంది. అలాగే వంకాయ, సొర, బీర, కాకర, పొట్లకాయలు, ఆలుగడ్డతోపాటు అన్నిరకాల కూరగాయలు, ఆకుకూరలు జిల్లాలో బాగానే పండుతాయి. కానీ కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు బాగా దెబ్బతిని దిగుబడి తగ్గింది. దీంతో ఒక్కసారిగా ధరలకు రెక్కలొచ్చాయి.

కూరగాయలు	కిలో ధర(రూ.)
టమాటా	60
పచ్చిమిర్చి	80
బెండకాయ	90
ఉల్లిగడ్డ	30
ఆలుగడ్డ	30
వంకాయ	80
దొండకాయ	50
క్యారెట్	60
క్యాబేజీ	50
ఆకుకూరలు	60

ధరలు పెరిగిపోయాయి..



కూరగాయల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. నెల కిందట టమాట కిలో రూ.20 ఉంటే.. ఇప్పుడు రూ.60కి చేరింది. అన్నిరకాల కూరగాయలు అధిక ధరలకే అమ్ముతున్నారు. రూ.100 తీసుకుపోతే రెండు రోజులకు సరిపడా కూరగాయలు కూడా రావడంలేదు. చాలా కష్టంగా ఉంది.

– పాతూరి మంజుల, దుబ్బాక

వానలు కురవడం వల్లే..



వర్షాలు బాగా కురవడం వల్ల కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. కూరగాయల దిగుబడి చాలా తగ్గిపోయింది. దీంతో మార్కెట్‌కు కూరగాయలు రావడం లేదు. అందువల్లే ధరలు పెరిగిపోతున్నాయి. రైతులకు కూడా ఏం లాభం లేదు. పంట దిగుబడి చాలా తగ్గిపోయి తీవ్రంగా నష్టపోయాం.

– సతీశ్, రైతు

సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించండి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలస్వామి

సిద్దిపేటఅర్బన్: పంచాయతీలలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగులు, వర్కర్ల యూనియన్ 3వ మహాసభ సిద్దిపేటలోని కార్మిక, కర్షక భవనంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, డంపింగ్‌యార్డు నిర్వహణ, ప్రభుత్వ పథకాలలో సహకారం అందిస్తూ నిరంతరం పనిచేసే కార్మికులకు సరైన ఉద్యోగ భద్రత లేకపోవడం దారుణం అన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేసి వారికి ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్, నాయకులు ప్రభాకర్, రాజమౌళి, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఈగలతో జర భద్రం..

డీపీఓ దేవకీదేవి



అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ దేవకీదేవి

దౌల్తాబాద్(దుబ్బాక): గ్రామంలో వ్యాప్తి చెందుతున్న ఈగలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీపీఓ దేవకీదేవి సూచించారు. తమ గ్రామంలో ఈగలు అధికంగా ఉన్నాయని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండల పరిధిలోని ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం ఆమెకు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశాడు. దీంతో డీఎంహెచ్‌ఓ ధనరాజ్, జిల్లా పశు వైద్యాధికారి పూర్ణచంద్రరావుతో కలిసి ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి దగ్గర్లలో ఫౌల్ట్రీ ఫారాలు ఉండడం వల్లే ఈగలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. చనిపోయిన కోళ్ళను బయటపడేసిన కోళ్ళ ఫారాల యజమానులకు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ గఫూర్ ఖాద్రి, పంచాయతీ కార్యదర్శి సునీతను ఆదేశించారు. చనిపోయిన కోళ్ళను గుంతతీసి పూడ్చిపెట్టాలని సూచించారు. గ్రామంలో ఈగల మందులకయ్యే ఖర్చులు వారే భరించాలన్నారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయించి, వీధుల్లో ఈగల మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో డీఎల్పీ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రేవతి, ఇన్‌చార్జి మండల పశు వైద్యాధికారి శ్రావణ్ కుమార్, మండల వైద్యాధికారి నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ జహీరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలను తిప్పికొడదాం

సీపీఎం రాష్ట్ర నేత అబ్బాస్



మాట్లాడుతున్న అబ్బాస్

సిద్దిపేటఅర్బన్: దేశంలో కేంద్రం అమలు చేస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్ పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని కార్మిక, కర్షక భవన్‌లో ఆదివారం 'నయా ఉదారవాదం- నయా ఫాసిజం' అనే అంశంపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నయా ఉదారవాద విధానాలతో దేశంలో ఆర్థిక, సామాజిక అంతరాలు ఏర్పడుతున్నాయని, పెట్టుబడిదారులకు పన్నులు తగ్గిస్తూ, సాధారణ ప్రజలపై పెనుభారం వేస్తున్నారని మండిపడ్డారు. స్వేచ్ఛా మార్కెట్ పేరుతో అమలవుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల దేశంలో నిరుద్యోగం, పేదరికం, అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు శోభన్, జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్, రవికుమార్, రవీందన్, శ్రీనివాస్, నవీన, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు భూమిపూజ



ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: భక్తులపై గ్రామదేవతల ఆశీస్సులు ఎప్పప్పుడూ ఉండాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆకాంక్షించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(ఏటిగడ్డ కిష్టాపూర్)లో ఆదివారం గ్రామదేవతలు పోచమ్మ, ముత్యాలమ్మల దేవాలయ నిర్మాణాలకు మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో సర్వం కోల్పోయిన తమను చల్లంగా చూడాలని, గ్రామదేవతల ఆశీస్సులు ఎల్లప్పుడూ తమపై ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డు ఏర్పాటు

చేర్యాల(సిద్దిపేట): ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచనలతో కడవేర్గు మాజీ ఎంపీటీసీ గదరాజు యాదగిరి ట్రాక్టర్లు, జేసీబీ సహాయంతో స్థానిక బ్రిడ్జి వరకు తాత్కాలికంగా మట్టిరోడ్డు వేయించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ శివారులో నిర్మించిన హై లెవల్ వంతెన నిర్మాణం పూర్తయినా బీటీరోడ్డు నుంచి వంతెన వరకు రోడ్డు లేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టి తీసుకువెళ్లానని చెప్పారు. దీంతో తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేయాలని సూచించారన్నారు. దీంతో రైతులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

పోచమ్మ తల్లికి శ్రావణ బోనాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో ఆదివారం రెడ్డిసంఘంలో ఆధ్వర్యంలో పోచమ్మతల్లికి శ్రావణ బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్ల మధ్య పోతరాజుల నృత్యాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు అంజిరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీరాంరెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని లక్ష్మీపూర్‌లో దివ్యాంగుల, ఆసరా పెన్షన్ కమిటీల అధ్యక్షులుగా బుచ్చిరెడ్డి, నర్సింహాచారిని ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి పరశురాములు తెలిపారు. లక్ష్మీపూర్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించే దివ్యాంగులు, ఆసరా పెన్షన్‌దారుల సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పరశురాములు, రవి, రాజు, శంకర్, బాలయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో కాంగ్రెస్ నేతల వాగ్వాదం



కాంగ్రెస్ నాయకులతో వాదిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకుల మధ్య రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సాక్షిగా వాగ్వాదం చోటు చేసుకుంది. మండల పరిధిలోని పెద్దచెప్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభం కార్యక్రమానికి ఆదివారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యతో కలిసి వచ్చిన ఎమ్మెల్యే యూరియా పంపిణీ విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ చేసిన వ్యాఖ్యలపై అక్కడున్న కాంగ్రెస్ నాయకులు అడ్డుపడ్డారు. ప్రభుత్వంపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమంటూ కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్ళపాటు ఎంపీగా ఉండి నియోజకవర్గానికి ఏమి ఒరగబెట్టారంటూ నిలదీశారు. అయితే ఎమ్మెల్యే మాట్లాడుతూ యూరియా కొరత ఉందని మీడియా ముందు మాట్లాడితే కాంగ్రెస్ నాయకులు వాగ్వివాదానికి దిగడం సమంజసంగా లేదని అసహనం వ్యక్తం చేశారు. పోలీసులు రెండు వర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం రైతులను విస్మరించిన సంగతి ప్రజలు గమనిస్తున్నారంటూ ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్ళిపోవడంతో వాగ్వివాదం సద్దుమణిగింది.

రోడ్లు బురదమయం.. నాట్లువేసి నిరసన



నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

హుస్నాబాద్: పట్టణంలోని రెడ్డి కాలనీలో రోడ్లు గుంతలుగా ఏర్పడి బురదమయంగా మారడంతో ఆదివారం ఆ కాలనీవాసులు వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో వర్షంవస్తే రోడ్లపైనే నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.50 లక్షల చొప్పున నిధులు కేటాయించి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారన్నారు. శంకుస్థాపన చేసి ఏడు నెలలు గడుస్తున్నా కొన్ని వార్డుల్లో పనులు ప్రారంభించలేదని వాపోయారు. 2, 14వ వార్డుల్లో అడుగుకో గుంత ఏర్పడి ప్రజలు నడవలేని దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వాకింగ్ పేరిట మెయిన్ రోడ్డుపైనే తిరుగుతున్నారే తప్ప వార్డుల్లోని వీధుల్లో తిరగడం లేదని ఎద్దేవా చేశారు. వెంటనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

సంస్కృతిని సంరక్షించడం అందరి బాధ్యత

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి



కోలాటం ఆడుతున్న మహిళలు

హుస్నాబాద్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. భాషా సాంస్కృతికశాఖ, సంకల్ప స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి పౌరాణిక, జానపద సాంస్కృతిక జాతర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె సుద్దులు, పౌరాణిక నాటకాలు, మహిళల కోలాటం, జానపదమే మన ప్రాణపదమన్నారు. వీటిని భావితరాలకు అందించేందుకు కళాకారులు కృషి చేయాలని సూచించారు. అనంతరం కళాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వెంకటనర్సయ్య, జానపద పరిశోధకుడు శ్రీనివాస్, స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు

త్రీటౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

కొండపాక(గజ్వేల్): మత్తుపదార్థాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని త్రీటౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దుద్దెడ శివారులోని రాజీవ్ రహదారి వద్ద ఆదివారం ఆయన ప్రజలకు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపి ప్రమాదాలబారిన పడొద్దని, తెలియని వ్యక్తులకు ఆధార్, బ్యాంక్ అకౌంట్ నంబర్లు, ఓటీపీలు చెప్పి మోసపోవద్దని సూచించారు. మోసానికి గురైన గంటలోపు 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఆయన వెంట ఏఎస్ఐ శ్రీనివాస్, పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'తో హత్యాకాండ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పౌరహక్కుల సంఘం నేతలు

పౌరహక్కుల సంఘం నేతలు

సిద్దిపేటకమాన్: ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసులు, గిరిజనులపైన కేంద్ర ప్రభుత్వం పాల్పడుతున్న హత్యాకాండను తక్షణమే నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని కోరుతూ వరంగల్‌లో 24న జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవుల్లో ఉన్న సహజసిద్ధమైన ఖనిజ సంపదను కార్పొరేట్, ప్రైవేటు, పెట్టుబడిదారులకు కట్టబెట్టేంకు కుట్ర చేస్తున్నారన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భూపతి, నారాయణరావు, సత్తయ్య, బాబురావు, నర్సింలు, ఎల్లం, ఆనంద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపరు..

పరిహారం ఇవ్వరు!

మండలంలోని చర్లఅంకిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీతోపాటు పంట పొలాలు ఏటా వర్షాకాలంలో ముంపునకు గురవ్వడం మామూలైపోయింది. ప్రతియేటా వర్షాకాలం వచ్చిందటే పంట పొలాలు నీట మునగతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పుడమి తల్లిని నమ్ముకున్న అన్నదాతలకు ఇది అంతుచిక్కని సమస్యగా మారింది.

- ఏటా ముంపునకు గురవుతున్న పొలాలు
- వానాకాలం పంటలు వేయలేని దుస్థితి
- పట్టించుకోని అధికారులు



చర్లఅంకిరెడ్డి పల్లిలో నీట మునిగిన వరి పొలాలు

చిన్నకోదూరు(సిద్దిపేట): కోహెడ మండలం శనిగరం వద్ద వందేళ్ల క్రితం ఒక టీఎంసీ సామర్థ్యంతో మధ్యతరహా ప్రాజెక్టు నిర్మించారు. వానాకాలంలో వర్షాలు బాగా పడితే ప్రాజెక్టు నిండి చర్లఅంకిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీతోపాటు పంట పొలాలు ముంపునకు గురవుతాయి. అదే కాకుండా గ్రామ శివారులో నిర్మించిన హెచ్‌ఎండీఏ వాటర్ పంప్‌హౌజ్‌లోని వృథానీరు చెరువులోకి భారీగా చేరుతుంది. దీంతో ప్రాజెక్టు బ్యాక్ వాటర్ సమస్యతో ప్రతియేటా పంట పొలాలు నీట మునుగుతున్నాయి.

200 ఎకరాలకు నష్టం

సుమారు 200 ఎకరాల్లో వానాకాలంలో పంటలు వేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సుమారు 20 కుటుంబాలు నివసిస్తుండగా వానాకాలం వచ్చిందంటే ఇళ్లలోకి నీరు చేరడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బాధితులకు ప్రత్యామ్నాయ మార్గాలు కానీ, పరిహారం చెల్లింపుపై కానీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సీ కాలనీ వాసులకు స్థలాలు కేటాయించాలని, మునుగుతున్న పంటలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కోరుతున్నారు.